చేవెళ్లలో మూడోసారి

బీఆర్ఎస్ జెండా ఎగురవేస్తాం

ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ



కాసాని జ్ఞానేశ్వర్‌కు మద్దతుగా ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

హైదర్‌నగర్, మే 8 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ గెలుపు కోసం ఆల్విన్‌కాలనీ డివిజన్ మహాత్మాగాంధీనగర్ కాలనీవాసులతో ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ బుధవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చేవెళ్లగడ్డపై మూడోసారి బీఆర్ఎస్ జెండా ఎగురవేస్తామన్నారు. రాష్ట్రాన్ని సాధించి, అభివృద్ధి చేసిన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు ప్రజలందరూ మద్దతుగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. మోసపూరిత హామీలు ఇస్తున్న కాంగ్రెస్, బీజేపీలను నమ్మొద్దన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు, మాజీ కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌వి అబద్ధపు హామీలు: ఎమ్మెల్యే సబితారెడ్డి

ఎల్‌బీనగర్: అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఐదు నెలల్లోనే ప్రజలకు సినిమా చూపిస్తోందని మాజీమంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఆరోపించారు. బుధవారం సాయంత్రం సరూర్‌నగర్‌లోని ఏఎస్ గార్డెన్‌లో నిర్వహించిన సమావేశంలో చేవెళ్ల బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్, శాసనమండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్‌లతో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ మరోమారు ప్రజలను మోసం చేసేందుకు సిద్ధమైందన్నారు. కాంగ్రెస్ మోసం చేసిందన్న విషయాన్ని ప్రజలు గ్రహించారని మే 13న కర్రుకాల్చి వాతపెట్టనున్నారని ఆమె చెప్పారు. కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించాలని ఆమె ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ మాట్లాడుతూ పదేళ్ల కాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాలను చూసి ఓటు వెయ్యాలని కోరారు. హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని మండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్ విమర్శించారు. బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను ఎంపీగా గెలిపించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో సరూర్‌నగర్ బీఆర్ఎస్ మాజీ అధ్యక్షుడు ఆకుల అరవింద్‌కుమార్, ఇంటూరి అంకిరెడ్డి, సుశీలరెడ్డి, యువజన విభాగం మాజీ అధ్యక్షుడు లోకసాని కొండల్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ దర్పలి అశోక్, ప్రజాసమస్యల పరిష్కార సమితి అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ ఆర్.గోపాల్, రమేష్‌గౌడ్, నరేష్‌గౌడ్, కేశవరెడ్డి, ఇస్మాయిల్, జహీర్, సలీం, ఉషాగౌడ్, ప్రత్యూష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

● కాసానిని ఎంపీగా గెలిపించండి

రాజేంద్రనగర్: బడుగు, బలహీన వర్గాల నాయకుడు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ ఎంపీగా గెలిపించాలని అత్తాపూర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు వనం శ్రీరాంరెడ్డి కోరారు. కాసాని జ్ఞానేశ్వర్‌కు మద్దతుగా బుధవారం అత్తాపూర్ డివిజన్ పరిధిలోని శివాజీనగర్, హుడాకాలనీ పరిసర బస్తీలలో నాయకులతో కలిసి ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ హయాంలో విద్యుత్ కోతలు లేవన్న ఆయన, కాంగ్రెస్ ప్రభుత్వంలో చిన్నపాటి గాలులకే గంటల తరబడి కరెంట్ కోతలు విధిస్తున్నారని విమర్శించారు. ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ప్రచారంలో మహేశ్ ముదిరాజ్, శివకుమార్, జైహింద్‌రెడ్డి, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.



హుడా కాలనీలో ప్రచారం చేస్తున్న శ్రీరాంరెడ్డి తదితరులు



సమావేశంలో మాట్లాడుతున్న సబితా ఇంద్రారెడ్డి, పక్కన కాసాని జ్ఞానేశ్వర్

కాంగ్రెస్‌కు ఓటేసి

రంజిత్‌రెడ్డిని గెలిపించాలి

మియాపూర్, మే 8 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేసి చేవెళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ కోరారు. మాదాపూర్ డివిజన్ మాతృశ్రీనగర్‌కాలనీలో బుధవారం ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం నుంచి భారీగా నిధులు తీసుకొచ్చి అన్ని డివిజన్లను అభివృద్ధి చేస్తామన్నారు.



కాంగ్రెస్ పార్టీలో చేరిన వారితో జగదీశ్వర్‌గౌడ్

● రంజిత్‌రెడ్డికి మద్దతుగా కార్పొరేటర్ ప్రచారం

హైదర్‌నగర్: రంజిత్‌రెడ్డికి మద్దతుగా కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ ఆల్విన్‌కాలనీ డివిజన్ జయనగర్‌లో పార్టీ నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటర్లను కలిసి కాంగ్రెస్‌కు ఓట్లు వేసి రంజిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలకు బుధవారం విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రామకృష్ణగౌడ్, సమ్మారెడ్డి, అనిల్‌రెడ్డి, శివరాజ్‌గౌడ్, సీహెచ్ భాస్కర్, షౌకత్‌అలీమున్నా, ప్రదీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● చందానగర్: చందానగర్‌లో కాంగ్రెస్ చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి రంజిత్‌రెడ్డికి మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న పార్టీ సీనియర్ నాయకుడు ఉరిటి వెంకట్రావ్.

● తాతా.. ఇదే చేయి గుర్తు.. జాగ్రత్తగా గుద్దు!

సరూర్‌నగర్: లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని గుర్రంగూడలో రంజిత్‌రెడ్డికి మద్దతుగా నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో భాగంగా ఓ వృద్ధుడికి నమూనా ఈవీఎం చూపించి హస్తం గుర్తుపై ఓటేయాలని కోరుతున్న మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ చిగిరింత నర్సింహారెడ్డి.



నాకు సాయం చేసే గుణం ఎక్కువ

సరూర్‌నగర్: 'నా దగ్గర ప్రత్యర్థి పార్టీల అభ్యర్థుల దగ్గర ఉన్నంత డబ్బు లేకపోవచ్చు.. కానీ అడిగిన వారికి లేదనకుండా సాయం చేసే గుణం ఉంది'. అని కాంగ్రెస్ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం రాత్రి మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డితో కలిసి మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని లెనిన్‌నగర్ చౌరస్తా నుంచి ప్రశాంతిహిల్స్ మీదుగా నందిహిల్స్ వరకు రోడ్ షో నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. గతంలో తాను ఎంపీగా, తీగల ఎమ్మెల్యేగా ఉండి మీర్‌పేట్ ప్రాంతాన్ని అభివృద్ధి చేశామని, తనను మరోసారి గెలిపిస్తే మున్ముందు మరింత అభివృద్ధి చేసి చూపిస్తానని ఆయన అన్నారు.



మీర్‌పేట్ కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న రంజిత్‌రెడ్డి

● రంజిత్‌రెడ్డికి ఓటేయండి

గడ్డం రంజిత్‌రెడ్డి చేయి గుర్తుపై ఓటేయాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట్ మేయర్ చిగిరింత పారిజాతా నర్సింహారెడ్డి ఓటర్లను కోరారు. ఆమె బడంగ్‌పేట్ కార్పొరేషన్ 29వ డివిజన్‌లోని పలు కాలనీల్లో బుధవారం పర్యటించారు.

● కాంగ్రెస్‌లో చేరికలు

బడంగ్‌పేట్ కార్పొరేషన్ 12వ డివిజన్‌లోని రంగనాయకులకాలనీకి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు బుధవారం బడంగ్‌పేట్ మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ చిగిరింత నర్సింహారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో బుధవారం చేరారు.



చందానగర్‌లో ప్రచారం చేస్తున్న ఉరిటి వెంకట్రావ్, నాయకులు

'బీసీలకు తీవ్ర అన్యాయం చేసిన కేసీఆర్'

గాజులరామారం, మే 8(ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ ఆధ్వర్యంలో తెలంగాణ బీసీ కుల జేఏసీ నాయకులు గాజులరామారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సమావేశమైనారు. మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి పట్నం సునీతారెడ్డికి తమ మద్దతును బీసీ కుల సంఘ నాయకులు ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ విభజన తరువాత కేసీఆర్ ప్రభుత్వం పక్షపాత ధోరణితో తెలంగాణాలోని బీసీ జాబితా నుంచి 26 కులాలను తొలగించారని ఆవేదన వ్యక్తం చేశారు. దీని వల్ల ఎటువంటి ప్రభుత్వ ఫలాలు అందక ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడి పోతున్నామని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తమ మద్దతు ప్రకటించామని తెలియజేశారు. కార్యక్రమంలో బీసీ 26 కులాల జేఏసీ నాయకులు కందిబోయిన శ్రీనివాస్, గొల్ల బాబూరావు, యుగేందర్, నాయుడు, సత్యనారాయణ పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్‌కు గడువు పొడిగింపు

కుత్బుల్లాపూర్, మే 8 (ఆంధ్రజ్యోతి): పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ గడువు మరో రెండు రోజులు పొడిగించారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలో మొత్తం 1,941 పోస్టల్ బ్యాలెట్ ఓటర్లు ఉండగా బుధవారం నాటికి మొత్తం 1,523 మంది ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. అయితే పోస్టల్ బ్యాలెట్ ఉపయోగించుకునేందుకు బుధవారంతో గడువు ముగియడంతో మరో రెండు రోజులు (10వ తేదీ వరకు) అవకాశాన్ని ఎన్నికల సంఘం పొడిగించినట్లు అధికారులు తెలిపారు.



కూకట్‌పల్లి పోలీసుల అదుపులో బజరంగ్‌దళ్ కార్యకర్తలు

సీఎం వ్యాఖ్యలకు నిరసనగా బజరంగ్‌దళ్ ఆందోళన

కూకట్‌పల్లి, మే 8 (ఆంధ్రజ్యోతి): శ్రీరాముడు, శ్రీరామ అక్షింతలపై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా బుధవారం బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో కూకట్‌పల్లి వైజంక్షన్ వద్ద ఆందోళన చేపట్టారు. పెద్దఎత్తున తరలివచ్చిన బజరంగ్‌దళ్ కార్యకర్తలు సీఎంకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సీఎం దిష్టిబొమ్మను దహనం చేసేందుకు ప్రయత్నించడంతో పోలీసులు అడ్డుకొన్నారు. దీంతో పోలీసులు, బజరంగ్‌దళ్ కార్యకర్తల మధ్య తోపులాట చోటుచేసుకొంది. స్వల్ప ఉద్రిక్తల నడుమ 19 మంది బజరంగ్‌దళ్ నాయకులు, కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

చందానగర్‌లో విద్యుత్ సరఫరాలో అంతరాయం

చందానగర్,మే8(ఆంధ్రజ్యోతి): వర్షం బీభత్సంతో విద్యుత్ తీగలపై చెట్లకొమ్మలు విరిగి పడటంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. చందానగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు కాలనీల్లో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు అరకొర సరఫరా ఉండటంతో కాలనీవాసులు అవస్థలకు గురయ్యారు. ముఖ్యంగా ఇంజనీరింగ్ ఎన్‌క్లేవ్, హుడాకాలనీతో పాటు పలుకాలనీలో విద్యుత్ లేక ప్రజలు తీవ్ర అవస్థలు పడ్డారు. బుధవారం మధ్యాహ్నం తారానగర్ సబ్‌స్టేషన్‌ను వద్ద విద్యుత్ ఎందుకు లేదని స్థానికులు ఆందోలనకు దిగారు.

అదుపు తప్పి చెట్టును ఢీకొట్టిన కారు.. ఇద్దరికి గాయాలు

పేట్‌బషీరాబాద్, మే 8(ఆంధ్రజ్యోతి): అతి వేగంతో వెళ్తున్న కారు రోడ్డుపై ఉన్న గుంతను తప్పించ బోయి అదుపు తప్పి చెట్టును ఢీకొట్టి పల్టీ కొ ట్టింది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న ఇద్దరు విద్యార్థులకు తీవ్ర గాయాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పేట్‌బషీరాబాద్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బడంగ్‌పేటకు చెందిన లక్ష్మణ్ కుమారుడు అమోగత్ తరుణ్(21) ప్రైవేటు కాలేజీలో లా చదువుతున్నాడు. ఎస్ఆర్‌నగర్‌కు చెందిన విద్యార్థిని బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. వీరిద్దరు స్నేహితులు. కాగా బుధవారం మైసమ్మగూడకు కారులో వెళ్తుండగా దూలపల్లి ఫారెస్ట్ అకాడమీ సమీపంలో రోడ్డుపై ఉన్న గుంతను తప్పించబోయి అదుపు తప్పి చెట్టును ఢీకొట్టుకొని పల్టీ కొట్టింది. స్థానికులు 100 డయల్‌కు సమాచారం ఇవ్వడంతో పేట్‌బషీరాబాద్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని గాయాలపాలైన ఇద్దరిని ఆస్పత్రికి తరలించారు.

బీజేపీ గెలుపుతోనే దేశాభివృద్ధి

వివేకానందనగర్‌కాలనీ, మే 8 (ఆంధ్రజ్యోతి): బీజేపీ గెలుపుతోనే దేశాభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ సీనియర్ నాయకుడు ఎం.రవికుమార్‌యాదవ్ అన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం వివేకానందనగర్ డివిజన్ వెంకటేశ్వరనగర్‌లో బుధవారం పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటింటి ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. చేవెళ్ల బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని గెలిపిస్తే నియోజకవర్గ పరిధిలోని సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. రవీందర్‌రావు, నర్సింగ్‌రావు, శంకరయ్య, శ్రీహరి, గోపాల్‌రావు, మనోజ్, లక్ష్మణ్, స్రవంతి, రేణుక, కల్యాణ్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.



వెంకటేశ్వరనగర్‌లో ప్రచారం చేస్తున్న నేతలు

ఒక్కసారి అవకాశం ఇవ్వండి

బీజేపీ నేతల ఇంటింటి ప్రచారం



అన్నోజిగూడలోని మాట్లాడుతున్న ఈటల రాజేందర్

పేట్‌బషీరాబాద్, మే 8(ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ నియోజవర్గంలో బీజేపీ మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌కి ఒక్కసారి అవకాశం ఇవ్వాలని కొంపల్లి మున్సిపల్, రంగారెడ్డినగర్ డివిజన్‌లో బీజేపీ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ప్రచారానికి నాలుగు రోజులే సమయం ఉండడంతో డివిజన్, మున్సిపల్ వార్డుల్లో బీజేపీ నాయకులు ప్రచారాన్ని ఉదయం, సాయంత్రం వేళల్లో నిర్వహిస్తూ పువ్వు గుర్తుకు ఒక్కసారి అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. మోదీని మూడోసారి ప్రధానిని చేయాలని, ఈటల రాజేందర్‌ను గెలిపించాలని కోరారు. రాజిరెడ్డి, సతీష్‌సాగర్, శివాజీరాజ్, సరితారావు, జనార్ధన్‌రెడ్డి, మాధవిలు పాల్గొన్నారు.

● ఈటల గెలుపు కోసం ప్రచారం

కూకట్‌పల్లి: బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ గెలుపు కోసం మూసాపేట డివిజన్ పరిధిలో బుధవారం కార్పొరేటర్ కొడిచెర్ల మహేందర్ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మూసాపేట డివిజన్‌లోని బబ్బుగూడ, జనతానగర్ ప్రాంతాల్లో పర్యటిస్తూ బీజేపీ మేనిఫెస్టో, సంక్షేమ పథకాల గురించి కాలనీవాసులకు వివరించారు. కమలం గుర్తుకు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో శ్రీధర్, భాస్కర్, ఎర్రస్వామి, నాగరాజు, బసవరాజు, సుమన్, సద్గుణ, వాసవి, హేమలత, శ్రీనివాస్ పాల్గొన్నారు.

● ఈటల భారీ మెజారిటీతో గెలిపించండి

బాలానగర్: నీతి, నిజాయితీ, మంచితనం, సేవాగుణం ఉన్న ఈటల రాజేందర్‌ను ఎంపీ ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలిపించాలని బీజేపీ కూకట్‌పల్లి ఇన్‌చార్జి మాధవరం కాంతారావు నియోజకవర్గ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. మరోసారి దేశ ప్రధానిగా మోదీని చేయాలని ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. బుధవారం ఉదయం బీజేపీ మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌కు మద్దతుగా బాలానగర్ డివిజన్ అధ్యక్షుడు రమేష్ ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డెపల్లి రాజేశ్వర్‌రావుతో కలిసి ప్రచారం నిర్వహించారు. బీజేపీ నాయకులు శంకర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, రమేష్ పాల్గొన్నారు.

● హాస్టళ్ల విద్యార్థులకు సన్నబియ్యం అన్నం పెట్టా..

ఘట్‌కేసర్: సోషల్ వెల్ఫేర్ హాస్టళ్లలో విద్యార్థులకు సన్నంబియ్యం అన్నం తిన్నంత పెట్టాలని, అందుకోసం ఆర్థిక శాఖ మంత్రిగా చర్యలు చేపట్టింది తానేనని రాష్ట్ర మాజీమంత్రి, బీజేపీ మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. బుధవారం పోచారం మున్సిపాలిటీ పరిధిలోని అన్నోజిగూడ దివ్యాంగులకాలనిలో ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడుతూ.. తాను హాస్టల్‌లో ఉండి చదువుకున్నట్లు గుర్తు చేశారు. అప్పట్లో హాస్టళ్లలో పురుగుల అన్నం, నీళ్ల చారు ఉండేదన్నారు. హాస్టళ్లలో ఇబ్బందులు తెలిసిన వ్యక్తిని కనుక ఆర్థిక మంత్రిగా బాధ్యతలు చేపట్టగానే అనేక సంస్కరణలు చేపట్టినట్లు వివరించారు. ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయడంలో సీఎం పూర్తిగా విఫలమయ్యాడని ఆయన ఆరోపించారు.



తన భర్తను గెలిపించాలని కోరుతున్న ఈటల సతీమణి జమున

● ఈటల కుటుంబసభ్యుల ప్రచారం

బాలానగర్: బీజేపీ మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి ఈటల రాజేందర్ గెలుపు కోసం ఆయన కుటుంబసభ్యులు, కుల, మహిళా సంఘాలు, ఈటల స్నేహితులు పెద్దఎత్తున ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈటల సతీమణి జమున అన్ని నియోజకవర్గాలలో జరిగే కార్యక్రమాల్లో పాల్గొంటూ మహిళలకు బొట్టుపెట్టి తన భర్తను గెలిపించాలని ప్రచారం చేస్తున్నారు. ఈటల కోడలు క్షమిత సైతం బీజేపీ నాయకులు, కార్యకర్తలు, యువకులతో కలిసి ప్రతీ బస్తీలో కరపత్రాలు పంచుతూ ఓటర్లను కలుస్తున్నారు. కుటుంబసభ్యులే కాకుండా ఈటల సన్నిహితులు, ఉద్యమనాయకులు, స్నేహితులు బంధువులు సైతం ప్రచారం చేస్తున్నారు.



తడిసిన ధాన్యంను ఆరబోసిన రైతులు

ముంపు ప్రాంతాల్లో సహాయక చర్యలు

మియాపూర్,మే8(ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి నియోజకవర్గంలో మంగళవారం రాత్రి కురిసిన అకాల వర్షానికి ముంపు ప్రాంతాల్లో ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి పర్యటించారు. మియాపూర్ దీప్తిశ్రీనగర్‌లో పర్యటించి వరదనీరు నిల్వఉన్న ప్రాంతాల్లో సక్రమంగా బయటకు వెళ్లేలా జీహెచ్ఎంసీ సిబ్బంది, చర్యలు లోతట్టు ప్రాంత ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా సహాయక చర్యలు పర్యవేక్షించారు. దుండిగల్ గ్రామంలో వరి ధాన్యం తడిసింది. వరి చేను నేలకొరిగింది. పలు చోట్ల చెట్లు, విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి.





గచ్చిబౌలిలో స్తంభించిన ట్రాఫిక్, చందానగర్‌లో కూలిన చెట్టు

అదృశ్యమైన తల్లి, కూతురు



శిరీష, లేఖ్యశ్రీ

గాజులరామారం, మే 8(ఆంధ్రజ్యోతి): కూతురుతో కలిసి పని చేస్తున్న ఆఫీసుకు వెళ్లిన తల్లి తిరిగి రాలేదు. సూరారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూరారంమరాఠీ బస్తీకి చెందిన కూచనపల్లి శ్రీను, శిరీష(25) భార్యాభర్తలు. సోమవారం శిరీష ఎర్రగడ్డలో తాను పనిచేస్తున్న ఆఫీసుకు డ్యూటీకి వెళ్లింది. అయితే కూతురు లేఖ్యశ్రీ(7) పుట్టినరోజు ఉండడంతో ఆఫీసు వారు కూతురుతో కలిసి రమ్మారని భర్తకు చెప్పి వెళ్లింది.అయితే తాను ఆఫీసులో కళ్లు తిరిగిపడి పోవడంతో ఆస్పత్రిలో ఉన్నానని, మరుసటి రోజు ఇంటికి వస్తానని భర్త శ్రీనుకు ఫోన్ చేసి చెప్పింది. వెంటనే శ్రీను భార్యకు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చింది. అప్పటి నుంచి శిరీష ఇంటికి తిరిగిరాక పోవడంతో బుధవారం సూరారం పోలీసులకు శ్రీను ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేపడుతున్నారు.

పేదల సంక్షేమమే ధ్యేయం

షాపూర్‌నగర్, మే 8(ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సూరారం డివిజన్ బీఆర్ఎస్ మహిళా అధ్యక్షురాలు హేమలతారెడ్డి ఆధ్వర్యంలో మల్కాజిగిరి బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని గెలిపించాలని కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ ఆదేశాల మేరకు బుధవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పేద, మధ్య తరగతి ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేసే బీఆర్ఎస్ పార్టీకి ఓట్లు వేసి లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని వారు కోరారు. ప్రచారంలో భద్రప్ప, లావణ్య, సుభద్ర, ధనలక్ష్మి, భాగ్య, సువర్ణ, వెంకటమ్మ, విద్య, జయశ్రీ తదితరులు ఉన్నారు.



కల్యాణ్‌నగర్ కట్టమైసమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావుతో కార్పొరేటర్ రవీందర్‌రెడ్డి

● కొంపల్లిలో ప్రచారం


పేట్‌బషీరాబాద్: బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి గెలుపు కోసం కార్యకర్తలు, నాయకులందరూ కలిసికట్టుగా పని చేయాలని కొంపల్లి మున్సిపల్ చైర్మన్ సన్నా శ్రీశైలం యాదవ్ అన్నారు. మున్సిపల్ పరిధిలోని జయభేరి, వెన్సాయి అపార్టుమెంట్‌లో ఎన్నికల ప్రచారాన్ని కార్యకర్తలు, నాయకులతో కలిసి నిర్వహించారు. మున్సిపల్ మరింత అభివృద్ధి చెందాలంటే బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపు కోసం అందరూ పని చేయాలన్నారు.



సరూర్‌నగర్ ప్రియదర్శిని పార్కులో వాకర్స్‌తో ముచ్చటిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి

లక్ష్మారెడ్డికి మద్దతుగా ఎమ్మెల్యే ప్రచారం

బాలానగర్: బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డికి మద్దతుగా కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, బాలానగర్ కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డితో కలిసి బుధవారం కల్యాణ్‌నగర్‌లో ప్రచారాన్ని నిర్వహించారు. మొదట బస్తీలో ఉన్న కట్టమైసమ్మ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం కల్యాణ్‌నగర్‌లోని షటిల్ కోర్టును సందర్శించి క్రీడాకారులను, స్థానికులను కలిశారు. ఈనెల 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో కారుగుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఆయన సూచించారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న నగదు

రూ.22 లక్షల నగదు స్వాధీనం

దుండిగల్, మే 8(ఆంధ్రజ్యోతి): ఎన్నికల నేపథ్యంలో భాగంగా బాచుపల్లి ఎస్ఓటీ, బాలానగర్ పోలీసులు సంయుక్తంగా వాహనాలను తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో రూ.22 లక్షలను పోలీసులు బుధవారం పట్టుకున్నారు. బాచుపల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ శ్రీకృష్ణనగర్‌కాలనీకి చెందిన పి.అఖిల్, బోడుప్పల్ బుద్ధానగర్‌కు చెందిన శశికిరణ్‌లు తెలంగాణ గోల్డ్ బయ్యర్స్‌లో మార్కెటింగ్ చేస్తుంటారు. బుధవారం బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో పోలీసులు వాహనాలను తనిఖీలు చేస్తుండగా టీఎస్09 ఇఎం3522, టీఎస్08జిఎల్1767 నెంబర్లు గల రెండు హోండా యాక్టివా వాహనాల్లో రూ.22 లక్షలు లభించాయి. నగదుకు సంబంధించిన ఎలాంటి పత్రాలు వారి వద్ద లేకపోవడంతో పోలీసులు ఆ డబ్బుని స్వాధీనం చేసుకొని, వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.